వాళ్ళ ప్రేమని
త్రుంచేయాలని చూసిన
ఆతండ్రికి తెలిసిన
అసలు నిజం!

# హిమశిల్పం

ప్రఫుల్లచంద్ర
కథ

ట్రాఫిక్ సిగ్నల్ ఎర్రగా మారడంతో మారుతి ఠక్కున ఆగిపోయింది.

కారు బ్యాక్‌సీటులో హుందాగా జారగిలపడి — జీబ్రా క్రాసింగ్‌వద్ద రోడ్డు దాటుతున్న జనంవైపు యథాలాపంగా చూశాడు గోపాల్రావు.

అపర్ణ!

ఉలిక్కిపడి కళ్లు పెద్దవిచేసి మరీమరీ చూశాడాయన.

ఆ యువకుడి చేతిలో చెయ్యివేసి రోడ్డు దాటుతున్నది అపర్ణ!

నగరంలో ప్రముఖ వ్యాపారవేత్త కోటీశ్వరుడూ అయిన గోపాల్రావుగారి ఏకైక కుమార్తె అపర్ణ. ఆయన కోట్లకు, బిజినెస్‌కు వారసురాలు!

అయింది! అనుకున్నంతా అయింది! ఎవడో రికామీగాడు అమ్మాయిని బుట్టలో వేసుకుని తన కోట్లు కొట్టేద్దామనుకుంటున్నాడు! గోపాల్రావు గుండెల్లో రొద ప్రారంభం!


"సార్, ఇంటికొచ్చేశాం" డ్రైవర్ కారు డోర్ తెరిచి వినయంగా అన్నాడు.

గోపాల్రావు హుందాగా కారుదిగాడు. కాని అంత హుందాగానూ ఇంటిలోకి నడవలేకపోయాడు. అడుగులు తడబడ్డాయి. తడబాటు కనబడకుండా హాలులో నిలబడిపోయాడు. పరుగెత్తుకుని వచ్చిన నౌకర్లు చెప్పారు — అమ్మగారు లేడీస్ క్లబ్‌కి వెళ్లారు రావడం ఆలస్యం అవుతుందని.

"మరి అమ్మాయిగారు?"

"ఇంకా రాలేదండీ"

"రాగానే నా రూంలోకి పంపండి"



అంటూ నెమ్మదిగా మెట్లెక్కి తన రూంలోకి వెళ్లిపోయాడు గోపాల్రావు.

తన రూం — తన సామ్రాజ్యం! తన పెర్మిషన్ లేనిదే ఒక్క ప్రాణీ లోనికి అడుగుపెట్టలేదు. చివరకు భార్యకూడా!

ఇక్కడ — తన రూంలో — గోపాల్రావు ఏడవగలడు! జుట్టుపీక్కోగలడు! చొక్కా చింపుకోగలడు! గోచీ పెట్టుకుని గంతులేయ

గలడు! అద్దంలో తన ముఖం చూసుకుని వెక్కిరించగలడు!

కానీ గోపాలరావు ఇప్పుడవేవీ చేయడంలేదు!

సూట్ తీసేసి, కాటన్ పైజమా, షర్టూ ధరించి గంభీరంగా పచార్లు చేస్తున్నాడు. కానీ ఆయన హృదయం తేలికపడలేదు.

అపర్ణ... అపర్ణ ఎంత పనిచేసింది!

కాదు, కాదు. ఇందులో అపర్ణ తప్పు ఏమీ లేదు. ఆ రికామీగాడే...

అపర్ణ ఎవరినైనా ప్రేమించగలదంటే నమ్మలేదు తను. ప్రేమించడమేకాదు, ఆమే ద్వేషించలేదు, కోపించలేదు, సంతోషించలేదుకూడా. ఆమెదంతా వింత ప్రవృత్తి. విరాగిణిలాగ!

అపర్ణ పుట్టిన తర్వాతనే గోపాలరావు దశ అందుకుని లక్షాధికారి కోటీశ్వరుడయ్యాడు. అందుకే ఆయనకు అపర్ణ అంటే వల్లమాలిన అభిమానం.

అపర్ణ అని పేరు పెట్టినందుకు కాబోలు తపస్వినిలాగే ప్రవర్తిస్తుంది. చిన్నపిల్లలు ఆట బొమ్మలకోసం, స్వీట్స్‌కోసం యాగీ చేస్తారు. ఏడుస్తారు. అపర్ణ ఎప్పుడూ ఇది కావాలి అని పేచీ పెట్టలేదు. ఎప్పుడూ ఏడవనే లేదు.

''ఎంత బుద్ధి!'' అని మురిసిపోయేవారు అంతా.

పెరిగి పెద్దయిన తర్వాతకూడా ఆమెలో మార్పులేదు. ఆ వయసు పిల్లలు అలంకరణకు మంచి బట్టలకు వెంపరలాడుతారు. ఆభరణాలు కావాలంటారు. అపర్ణకు అవేమీ అక్కరలేదు. సహజ సౌందర్యమే చాలు.

పదో క్లాసు పరీక్షలో రాష్ట్రానికే ఫస్ట్ వచ్చినందుకు స్కూలులో సభ ఏర్పాటుచేసి బహుమతి ఇస్తే ఆమెలో విజయగర్వం కాదుకదా అసలు సంతోషమే కనిపించలేదు.

ఇది ఇలాగే జరుగుతుంది అని ముందుగానే తెలిసిన యోగినిలాగ ఆమె ముఖంలో నిర్వేదమే కనిపించేది.

అపర్ణ కాలేజీలో చేరేముందు కారు కొని ఇస్తే కాళ్లుండగా కారెందుకు అంది. తను చిరాకు పడితే మారుమాటాడకుండా కాలేజీకి కారులో వెళ్లడం ప్రారంభించింది.

అపర్ణ బుద్ధి పాదరసం. మనిషీ పాదరసమే. అంటే ముట్టని పాదరసం!

అలాంటి మనిషి ఇప్పుడు ఆ రికామీగాడితో నవ్వుతూ కనిపించిందంటే...

బజర్ మోగగానే పచార్లు ఆపి తలుపు తెరిచాడు గోపాలరావు.

''నన్ను రమ్మన్నారట?!'' అంటూ లోనికొచ్చి సోఫాలో కూర్చుంది అపర్ణ.

''ఎక్కడనుంచి వస్తున్నావ్?''

''ఫ్రెండ్‌తో పార్కుకి వెళ్లి...''

''ఫ్రెండ్ అంటే ఆడా? మగా?''

''అనంత్ అని రిటైర్డ్‌టీచర్ కొడుకు''

అబద్ధం ఆడితే మందలించి ఎంతయినా లెక్చర్ దంచవచ్చు. ఫ్రాంక్‌గా నిజం చెబుతున్న అపర్ణతో ఎలా మాట్లాడాలో అర్థంకాలేదు గోపాలరావుకి.

''చూడమ్మా, అపర్ణా...''

''మీరు చెప్పబోయేది నాకు తెలుసు నాన్నా! బట్ డోంట్ వర్రీ!'' అని నవ్వింది అపర్ణ! అపర్ణ నవ్వింది!!

ఆమె నవ్వడం ఒక ఆశ్చర్యం అయితే ఆ

నవ్వులో ఆకర్షణ మరో ఆశ్చర్యం! అలా నవ్వితే ఎంత బాగుంది అమ్మాయి! ఒక క్షణం ఆనందంగా అనిపించింది గోపాలావుకి. కాని అంతలోనే ఆయన ముఖం గంభీరంగా మారిపోయి హృదయంలో గుబులు పుట్టింది. అమ్మాయి నవ్వుతోందంటే ప్రేమలో పడిందన్నమాటే! సంతోషం, ప్రేమలాంటి భావాలకు అతీతం అనుకున్న అపర్ణలో మార్పు తెచ్చినవాడెవడో గట్టి పిండమే! రిటైర్డ్ టీచర్ కొడుకు! ఛీఛీ...

రాత్రి బెడ్‌రూంలో భార్యతో అన్నాడు గోపాలావు "ఇవాళ అమ్మాయి నవ్వింది!"

"ప్రక్కలో బల్లి పడినట్లు తుళ్ళిపడింది వల్లి.

"అమ్మాయి ఎవర్నో ప్రేమిస్తున్నట్టుంది"

వల్లి పక్కలో మరో బల్లి పడింది!

"రిటైర్డ్ టీచర్ వెంకట్రామయ్యగారి కొడుకు అనంత్ కాదుకదా!" అంది భయంభయంగా.

"నీకెలా తెలుసు?"

"మా క్లబ్‌లో గాసిప్స్... కిట్టనివారి ప్రచారం అనుకున్నా... నిజమేనన్నమాట"


తర్వాత ఇద్దరూ మాట్లాడలేదు. ఎవరి ఆలోచనలువారివి. ఎవరి భయాలు వారివి. ఏసీగదిలోకూడా చెమటలు పట్టేస్తున్నాయి వారికి.

ఏ అనుభూతులకూ స్పందించని అపర్ణను బంధువర్గంలో కొందరు — ఐస్ మెయిడెన్, హిమసుందరి, హిమశిల్పం — అని గేలిచేస్తారు. ఇప్పుడా మంచు కరిగిపోతున్నది! మంచు కరిగిపోతున్నందుకు సంతోషంగా వున్నా, ఆ శిల్పం ఏం కాబోతోందోనని ఆందోళన!

రెండు రోజులు గడిచాక —

సెక్రటరీ భయపడుతూ, సంశయిస్తూ, చెప్పలేక చెప్పలేక చెప్పింది.

"సార్, నిన్నరాత్రి మీ అమ్మాయి



డిస్కో క్లబ్‌లో ఒకబ్బాయితో డాన్స్ చేస్తూ కనిపించిందట!''

తీవ్రంగా చూశాడు గోపాలరావు. సెక్రటరీ తలవంచుకుని వెళ్లిపోయింది.

అటునుంచి నరుక్కురావాలని నిర్ణయించుకున్నాడు గోపాలరావు.

అనంత్‌ని రప్పించాడు.

నీ అంతస్తు ఏమిటి? నా అంతస్తు ఏమిటి? అని డైలాగులతో వాయగొట్టాడు. పిల్లను కాల్చిపారేసినట్టు కాల్చేస్తా అని బెదిరించాడు. ''డబ్బుకోసమేకదా ఈ ప్రేమ నటన? చెప్పు, ఎంతకావాలో'' అని గద్దిస్తూ చెక్కుబుక్కు తీశాడు.

అనంత్ కుంకుళ్లు కొట్టే రాయిలాగా వుండిపోయాడు.—

''చెప్పు! లక్షా? రెండు లక్షలా?'' ఉరిమాడు గోపాలరావు.

తల వంచుకుని కూర్చున్నాడు అనంత్.

''సరే, మూడు లక్షలు!''

అనంత్ కదలలేదు.

ఐదు లక్షలకు చెక్కురాసి అనంత్ జేబులో కుక్కి ''జాగ్రత్త! ప్రాణాలమీద ఆశవుంటే మళ్లీ అపర్ణను కలవకు'' అన్నాడు గోపాలరావు.

నెమ్మదిగా లేచి తలవంచుకుని వెళ్లిపోయాడు అనంత్. ఎంతో ప్రతిఘటన ఎదురువుతందని సిద్ధంగా వున్న గోపాలరావు నిర్ఘాంతపోయాడు. ఇంట్లో అపర్ణ వైఖరిలో మార్పేమీ లేదు. వాళ్లిద్దరూ కలిసి తిరుగుతున్న జాడా లేదు. సమస్య ఇంత తేలికగా పరిష్కారమవుతుందని ఊహించని గోపాలరావు సంతృప్తిగా నిట్టూర్చాడు.

అయితే ఆరు నెలల తర్వాత అపర్ణ పుట్టినరోజు పండుగ జరగకపోతే గోపాలరావు ఆ సంతృప్తితోనే జీవితాంతం వుండిపోయేవాడు!

ఆరోజు ఆహ్వానితులతోబాటు అనంత్ కూడా వచ్చాడు. అందరూ ఏవో ఫ్యాన్సీ వస్తువులు బహుమతిగా ఇస్తే అనంత్ పట్టుచీర, పసుపు, కుంకుమ బహుమతిగా ఇచ్చాడు. పైగా దేవుడిచ్చిన చెల్లీ అంటూ అపర్ణమీద చిన్న కవిత చదువుతూ ఆశీర్వదించి అందర్నీ ఆకట్టుకున్నాడు!

అపర్ణ తల్లిదండ్రులు నిర్ఘాంతపోయారు.

డిన్నర్ పార్టీ అందరూ వెళ్లిపోయాక అపర్ణను నిలదీశాడు గోపాలరావు.

''మనసులో ఏ భావం వుంటే కళ్లకి అదే కనిపిస్తుంది నాన్నా! అనంత్ నా ఫ్రెండ్ అని చెప్పాను. డోంట్ వర్రీ అనికూడా చెప్పాను. నీవు నమ్మలేదు. మనసులో ఏదో పెట్టుకుని అదే చేశావు! ఇప్పుడూ అదే చెబుతున్నా. అనంత్ నా ఫ్రెండ్. అయితే ఆ స్నేహం ముదిరి నన్ను చెల్లీ అని పిలుస్తున్నాడు. అంతే'' అంది అపర్ణ.

''మరి... మరి... నన్ను బ్లాక్‌మెయిల్ చేసి అనంత్ ఐదులక్షలు కొట్టేశాడు!'' చిరాకుపడిపోయాడు గోపాలరావు.

''అబద్ధం! అతడొక్క మాట మాట్లాడకపోయినా, నీవే అతని జేబులో చెక్కు కుక్కావు!''

ఆరోజు జరిగిందంతా గుర్తు చేసుకుని ''నిజమే. కానీ తను అయినా నిజం

చెప్పవచ్చుగా'' అన్నాడు తప్పుచేసి పట్టుబడినవాడిలా గోపాలరావు.

''నేను నిజం చెబితే నమ్మనివాడివి అనంత్ చెబితే నమ్ముతావా? తనకి డబ్బుకావాలి. అందుకే నిజమూ చెప్పలేదు, అబద్ధమూ చెప్పలేదు''

''ఏమిటిదంతా?'' తికమకపడిపోతూ చిరాకుగా అడిగాడు గోపాలరావు.

''అనంత్‌కి అన్ని అర్హతలూ వున్నాయి. అయితే బీదవాడు. ఉద్యోగం లేదు. అతడ్ని ఆదుకోవాలనుకున్నాను. మీకు పరువు ప్రతిష్ఠలంటే ప్రాణం. డబ్బంటే ప్రీతి. ఆ సెంటిమెంట్‌ను ఉపయోగించుకోవాలనుకున్నాను. మేమిద్దరం కలిసి తిరుగుతూ మీ దృష్టిలో పడాలనుకున్నాం. అంతే మేం చేసింది. మిగిలినదంతా మీరే చేశారు. మీరిచ్చిన ఐదు లక్షలతోబాటు నేను బ్యాంక్ ద్వారా ఇప్పించిన లోన్ పదిలక్షలు పెట్టి గిఫ్ట్ ఆర్టికల్స్ షాప్ పెట్టాడు అనంత్. వ్యాపారం బాగానే సాగుతోంది. వాయిదాల పద్ధతిలో బ్యాంక్ లోన్‌తోబాటు మీ సొమ్ముకూడా తీర్చేస్తాడు త్వరలో'' తేలికగా అంది అపర్ణ.

''బర్త్‌డేతో మేజర్‌నయాను. ఇంతవరకూ మీ ఇష్టాలకు అనుగుణంగా ఎదిగాను. ఇకనుంచీ నా ఆదర్శాలకనుగుణంగా నన్ను మలచుకోనివ్వండి నాన్నా!''

కళ్లు ఇంతలు చేసుకుని కొత్త వ్యక్తిని చూస్తున్నట్లు వుండిపోయాడు గోపాలరావు.

''ఇప్పటివరకు మనం మనకోసమే బతికాం నాన్నా! ఇకనుంచి సమాజంకోసంకూడా కొంత సమయం, కొంత డబ్బు కేటాయిద్దాం. మనం హాయిగా వుండడమే కాదు. మనచుట్టూ హాయి వెల్లివిరియాలి. మనం నవ్వడమేకాదు. చుట్టూ వున్నవారి జీవితాల్లోనూ నవ్వులు నింపాలి. మన ఇంటి దీపాలు వెలగడమేకాదు, చుట్టూ వున్న ఇళ్లలోనూ దీపాలు వెలిగించాలి. అదే నా ఆదర్శం! నాకు చేయూతనిస్తావా నాన్నా?'' అడిగింది అపర్ణ ఆర్తిగా.

ఏదో నిర్ణయం రూపుదిద్దుకున్నట్టు గోపాలరావు కూతురు భుజంతట్టి దరహాసం చిందించాడు.

## ఎలుకలు

ఒక వ్యక్తి అడిగాడు మరో వ్యక్తిని.

''కడుపులో ఎలుకలు పరుగెడుతున్నాయి. ఓ రూపాయి ఇవ్వండి ఏదైనా తింటాను''

ఆ వ్యక్తి [illegible] పొట్లాం తీసి ఇచ్చి ''ఇది [illegible] లోకి పంపి ఎలుకల్ని చంపేయ్'' [illegible]

— [illegible] (కాకినాడ)

